‘భగీరథ’ కొందరికేనా?

- బాన్సువాడ పట్టణవాసులందరికి గొంతు తడవని పథకం
- కొన్ని రోజులుగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న పలు కాలనీల ప్రజలు
- పట్టించుకోని అధికారులు


పాత బాన్సువాడ గూడెంగల్లీలో కుళాయి వద క్యూలో ఉన్న కాలనీవాసులు

బాన్సువాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా తాగునీటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా బాన్సువాడ పట్టణంలో కొన్ని కాలనీలకే మంచి నీరు సరఫరా జరుగుతోంది. మిగిలిన కాలనీలకు మంచి నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూడు వార్డుల్లోనే..

బాన్సువాడ మున్సిపల్ పరిధిలో మొత్తం 19 వార్డులు ఉన్నాయి. అదనంగా మరికొన్ని గ్రామాలు గతంలో మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. దీంతో పట్టణ జనాభా 30 వేల నుంచి 40 వేల వరకు పెరిగింది. మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు మంచినీరును అధికారులు సరఫరా చేస్తున్నారు. కానీ గూడెంగల్లీ, సంగమేశ్వర్ కాలనీ పరిధిలోని మూడు వార్డుల్లోకి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. అధికారులు సరైన ప్రణాళికలు పాటించకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు మంచినీటికి దూరమయ్యారు. ప్రస్తుతం పట్టణంలోని ఆయా కాలనీల ప్రజలకు ఇప్పటికీ నీటి ఎద్దడి నెలకొంది. వేసవిలో నీటి సమస్య ఉత్పన్నం కావడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి తీరాలంటే..

పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందాలంటే బాన్సువాడ చింతల్‌నాగారం శివారులో ఉన్న డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు అందుబాటులోకి రావాల్సి ఉంది. మంజీర నుంచి ఫిల్టర్ బెడ్‌లోని సంపులకు నీటిని సరఫరా చేయాలి. అక్కడ క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని ట్యాంకులకు సరఫరా చేయాలి. ట్యాంకుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపి పట్టణవాసులకు పంపింగ్ చేయాలి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త ట్యాంకులను నిర్మించాలి. అక్కడక్కడ వాల్వ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరందేలా చర్యలు చేపట్టాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు.

అభివృద్ధి పనుల్లోనూ జాప్యం..

తాగునీరు అందించేందుకు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం నుంచి రూ.52 కోట్ల నిధులను కేటాయించగా, నిధులతో మున్సిపాలిటీ పరిధిలో ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పనులు ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. ఆరు నెలల్లో ట్యాంకుల నిర్మాణం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి..



బాన్సువాడలోని గూడెంగల్లీలో పదిహేను రోజులుగా తాగునీరు రావడం లేదు. ప్రతీ ఏడాది వేసవిలో ఇదే సమస్య పునరావృతం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–గంగారాం, బాన్సువాడ

మిషన్ భగీరథ పైపులు వేయలేదు..



మా గల్లీలో ఇప్పటి వరకు మిషన్ భగీరథ పైపులు వేయలేదు. నల్లలు పెట్టలేదు. పాత కుళాయిలే ఉన్నాయి. అవి కూడా పదిహేను రోజులుగా వస్తాలేదు. అధికారులకు చాలాసార్లు సమస్యను విన్నవించినా పరిష్కరించడం లేదు.

–సురేష్, గూడెంగల్లీ

తగిన చర్యలు చేపడతాం..

పట్టణానికి ప్రతీ రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నాం. కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆయా వార్డుల్లో పర్యటించి, తాగునీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

–శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

క్లుప్తంగా

రేషన్ పంపిణీలో అవకతవకలు జరగొద్దు



నస్రుల్లాబాద్: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలని తహసల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో రేషన్ లబ్ధిదారులకు మూడు నెలల బియ్యంను ఒకేసారి అందించాలన్నారు. అందుకు తగిన స్టాక్‌ను ముందుగానే తీసుకోవాలని ఆదేశించారు. రేషన్ డీలర్లు దత్తు, దశరత్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రైతులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి



బాన్సువాడ రూరల్: ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫార్మర్ ఐడీలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాన్సువాడ క్లస్టర్ ఇన్‌చార్జి ఏఈవో రాణీ అన్నారు. మండలంలోని బోర్లం గ్రామంలో సోమవారం ఆమె రిజిస్ట్రేషన్లు చేపట్టారు. ప్రతి రైతుకు డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేయడానికి వివరాలు తీసుకుంటున్నామన్నారు.

గోశాలకు పశువుల అప్పగింత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద ఆదివారం అర్ధరాత్రి పశువులను తరలిస్తున్న ట్రక్కును స్థానిక బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. అనంతరం నిజాంసాగర్ పోలీసులకు సమాచారం అందించగా పశువులను పోలీసుల సమక్షంలో బిచ్కుంద మండల కేంద్రంలోని బండాయప్ప గోశాలకు అప్పగించారు. నాయకులు రాజు, సంతోష్, జశ్వంత్ ప్రవీణ్, పోచయ్య, వినయ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి



మద్నూర్: డ్వాక్రా మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర రుణాలతో వ్యాపారం చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీవో అదనపు పీడీ మురళీకృష్ణ అన్నారు. మద్నూర్‌లో సోమవారం ఆయన మండల సమాఖ్య అధ్యక్షురాలు సిద్దాబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. గ్రామ సంఘాలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను చక్కగా నిర్వహించాయని కితాబిచ్చారు. డ్వాక్రా మహిళలు స్కూల్ యూనిఫామ్స్ స్టిచింగ్ చేసి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానికులు ఇటీవల జీపీ కార్యదర్శి బల్‌రాం దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన స్పందించి పైప్‌లైన్ల మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు. అదేవిధంగా మంచినీటి ట్యాంక్‌లకు మరమ్మతులు నిర్వహించి, ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. జీపీ సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

‘డబుల్ ఇళ్ల’ను కేటాయించాలి



భిక్కనూరు: గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రానికి మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే తమకు కేటాయించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం బీఆర్‌ఎస్ నేతలతో కలిసి భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ శృతికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ తున్కి వేణు, బీఆర్‌ఎస్ నేతలు పాల రాంచంద్రం, మంగలి బస్వయ్య, సరస్వతి ప్రభాకర్,రవి, రాయనగారి శ్రీనివాస్, చంద్రం, దాదేమియా నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

జనగామలో క్రీడాపోటీలు



బీబీపేట: మండలంలోని జనగామలో గ్రామ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు సోమవారం విద్యార్థులకు, యువకులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. బెల్లె రాజబాబు, పాత అశోక్, చల్మెడ చంద్రం, పాత రవి, ఆకులప్రవీణ్, పాత స్వామి, రాములు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చర్యలు



ఎల్లారెడ్డిలో ఫర్టిలైజర్ దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఏడీఏ అమీనా బీ.. సదాశివనగర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్: రైతులకు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విత్తన తనిఖీ బృందం ఏడీఏ అమీనా బీ అన్నారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో సోమవారం ఆమె స్టాక్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి బిల్లులను అందించాలని దుకాణాదారులకు సూచించారు. స్టాక్ వివరాలను బోర్డుపై నమోదు చేయాలని సూచించారు. ఏవోలు నదిమోద్దీన్, రాజు,కిషన్ తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘంలో ఫర్టిలైజర్ స్టాక్‌ను సోమవారం ఏవో ప్రజాపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రశీదులు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేని వ్యాపారుల వద్ద ఎలాంటి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవద్దన్నారు. రైతుల నుంచి దుకాణాదారులు అడ్వాన్స్‌లు వసూలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. విండో సీఈవో దేవేందర్, దుకాణ నిర్వహకులు రాజు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ


మాల్తుమ్మెద సొసైటీలో విత్తనాల బస్తాను అందజేస్తున్న చైర్మన్ నర్సింలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)/బిచ్కుంద(జుక్కల్)/లింగంపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద సొసైటీ కార్యాలయంలో సోమవారం చైర్మన్ నర్సింలు, సీఈవో సందీప్ రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. బిచ్కుంద మండలంలోని పుల్కల్ సొసైటీలో చైర్మన్ భీంరెడ్డి జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. లింగంపేట మండలంలోని నల్లమడుగు, లింగంపేట, శెట్పల్లిసంగారెడ్డి ప్రాథమిక సహకార సంఘాల నుంచి చైర్మన్లు రమేశ్, దెవేందర్‌రెడ్డి, రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు.


పుల్కల్ సొసైటీలో..


నల్లమడుగు సింగిల్ విండోలో..

గూడు లేని పేదల కోసమే ‘ఇందిరమ్మ’ పథకం



పిట్లంలో ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న నాయకులు.. చుక్కాపూర్‌లో భూమిపూజ చేస్తున్న నేతలు

పిట్లం(జుక్కల్): గూడు లేని నిరుపేదల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఎంపీడీవో కమలాకర్‌తో కలిసి వారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. నాయకులు ఇబ్రాహీం, జంబిగే హన్మండ్లు, మోయిన్, అశోక్, కార్యదర్శి బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, నవీన్‌గౌడ్, నర్సింహారెడ్డి, సులోచన, మమత, కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామస్వామి, పెద్దరాజయ్య, రఘుపతి ఉన్నారు.

జీపీ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడండి



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని కల్యాణి గ్రామ పంచాయతీ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని మాజీ సర్పంచ్ రఘువీర్‌గౌడ్ అన్నారు. ఈమేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మించే స్థలం కబ్జాకు గురవుతున్నదని, ఇట్టి స్థలం కబ్జా కాకుండా చూడాలని ఆయన విన్నవించారు.

‘విజిలెన్స్ కమిటీ’ని ఏర్పాటు చేయాలి



బాన్సువాడ: జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త అయ్యాల సంతోష్ అన్నారు. ఈ మేరకు సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రేష్ ఉన్నారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామంలో సోమవారం కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలకు చుట్టుపక్క మండలాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. కొబ్బరికాయ పోటీ నుంచి 2వేల వరకు, మూడు తులాల వెండి కడియం వరకు పోటీలు జరిగాయి. విజేతకు నిర్వాహకులు వెండి కడియాన్ని అందజేశారు. పిట్లం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ పటేల్, గుర్రప్ప. శ్రీనివాస్‌పటేల్, మెంగారం శ్రీనివాస్, చిన్నోళ్ల, జగన్, రాజం, గంగారాం, మాటూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలి



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని బీఎస్పీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం వారు ఆర్డీవో కార్యాలయంలో డీటీ మానసకు వినతిపత్రం అందించారు. నాయకులు సాయిబాబా, శివానందం, లింగమయ్య ఉన్నారు.

కామారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం


లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద మారుతిని సన్మానిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: తలసేమియా బాధిత చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం, కామారెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అదిత్య ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 73 మంది రక్తదానం చేయగా, 3వేల యూనిట్ల రక్తం సేకరించినట్లు సమూహం వ్యవస్థాపకుడు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు సంతోషం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ వివేకానంద అధ్యక్షుడు మారుతికి తలసేమియా సికిల్ సొసైటీ పురస్కారం అందజేసి అభినందించారు. ఆర్‌కే విద్యాసంస్థల సీఈవో జైపాల్ రెడ్డి, సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రతినిధులు వెంకటరమణ, చంద్రశేఖర్, గంప ప్రసాద్, వేదప్రకాష్, ఉప్పల హరిధర్, కుంబాల లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని భవానీపేటలో స్థానిక ప్రభుత్వ పాఠశాల టీచర్లు సోమవారం మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో కల్పించే సౌకర్యాలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి

సాక్షి ఎఫెక్ట్..


డ్రెయినేజీలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని సిబ్బందికి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని బేగంపూర్ తండాలో డ్రెయినేజీల దుస్థితిపై ఇటీవల ‘సాక్షి’లో ‘అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు’ అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మండల అధికారులు సోమవారం స్పందించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయినేజీలనున పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అలాగే పరిసరాలను శుభ్రం చేయించారు. చేరుకోని మురికి నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రం చేయించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతన సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపుటకు నిర్ణయించారు. కార్యదర్శి ప్రదీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి



నస్రుల్లాబాద్: మండలంలోని ప్రతి గ్రామంలో మంగళవారం నుంచి ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తామని, తనిఖీ బృందానికి సిబ్బంది, ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. నస్రుల్లాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకలు, ప్రజాధనం వృథా అవకుండా సామాజిక తనిఖీ చేపడుతున్నారన్నారు

ఘనంగా 108 పైలట్ డే



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం 108 పైలట్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 జిల్లా ప్రతినిధి తిరుపతి పలువురు టెక్నీషియన్లు, పైలట్లను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సిబ్బంది కృష్ణస్వామి, ప్రభాకర్, అర్జున్, కాశీరాం, యాదగిరి, పైలెట్లు రాజయ్య, సుదర్శన్, సంతోష్, నరేష్, భిక్షపతి, రాకేష్, స్వామి, రాజు, బాలనర్సింలు ఉన్నారు.

ఆకట్టుకున్న తిరంగా ర్యాలీ..


మద్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



మద్నూర్ : ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన దేశ సైనికులకు సంఘీభావంగా సోమవారం మద్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన తిరంగా ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. మద్నూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో రథ్‌గల్లీ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ పాతబస్టాండ్ వరకు ప్రధాన వీధుల గుండా సాగింది. వెయ్యి అడుగుల జాతీయ జెండాతో కులమతాలకు అతీతంగా సాగిన ర్యాలీ ఆద్యాంతం దేశభక్తి నినాదాలతో సాగింది. జైహింద్, జైభారత్, భారత్ మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, గ్రామ యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పుష్కరాలకు తరలిన కాంగ్రెస్ నేతలు

లింగంపేట/ఎల్లారెడ్డి: లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం సరస్వతీ పుష్కరాల కోసం కాళేశ్వరం తరలివెళ్లారు. నాయకులు బుర్ర నారాగౌడ్, నాయకులు శ్రీనివాస్, శంకరప్ప, సంగయ్య, వెంకట్‌గౌడ్, మల్లయ్య, కిరణ్, దుర్గారెడ్డి, భాస్కర్‌గౌడ్, మల్లయ్య, రాజు, నగేష్, ప్రశాంత్‌గౌడ్, సాయిబాబా, వినోద్‌గౌడ్ తదితరులున్నారు.


కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ దిల్దార్‌కు ఇటీవల ప్రమాదవశాత్తు కాలువిరిగింది. విషయం తెల్సుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంజవ్వ గణేష్ సోమవారం బాధితుడిని ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఎలక్ట్రికల్ వొకేషనల్ కోర్సు మళ్లీ ప్రారంభించాలి


కామారెడ్డి అర్బన్: భిక్కనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో ఉన్న బైపీసీ, ఎలక్ట్రికల్ వొకేషనల్ కోర్సులను మళ్లీ ప్రారంభించాలని ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ సోమవారం కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందించాలి



రాజంపేట: మండలంలోని ప్రభుత్వ బడుల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందించాలని ఎంపీడీవో రఘు రాం అన్నారు. మండలంలోని 35 బడుల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్ క్లాత్‌ను సోమవారం ఆయన ఐకేపీ సంఘాలకు అందజేశారు.ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివా స్, సాయిలు, వీవోఏలు భవాని, అన్నపూర్ణ, లక్ష్మి ఉన్నారు.

నీటి శుద్ధి యంత్రం ప్రారంభం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం బీవండికి చెందిన చింతల కళావతి రూ.3.80 లక్షల విలువైన నీటిశుద్ధి యంత్రాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం దాతలను వారు సత్కరించారు. ఆలయ సిబ్బంది సంతోష్, రమేశ్, స్వామి, కిషన్, అర్చకులు నర్సింహచార్యులున్నారు.

గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి సోమవారం కూల్‌వాటర్ డిస్పెన్సర్ వచ్చినట్లు ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం తెలిపారు. మర్రి నర్సింలు, బాపురావు, కల్పన, పాఠకులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వవిద్యార్థుల విరాళం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్ అభివృద్ధి కోసం సోమవారం పాఠశాలలోని 2001–02 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డికి రూ.15వేలు విరాళంగా అందజేశారు. పూర్వవిద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.